హిందుస్థానీ సంగీత లక్షణాలు

హిందుస్థానీ సంగీతంలో నిర్దిష్ట కాలాల్లో... కొన్ని 'రాగాలు' మాత్రమే పాడాలని సూత్రీకరించారు. కొన్ని ఉషోదయ రాగాలు.. కొన్ని మధ్యాహ్న రాగాలు.. మరికొన్ని సంధ్యా రాగాలుగా పేర్కొన్నారు. ఆయా సమయాల్లో ఆలపించిన రాగాలకు భావం చక్కగా వస్తుందన్న భావనే ఇందుకు కారణం. ఇటువంటి కాల నిర్దేశం కర్ణాటక సంగీత పద్ధతిలో లేదు!!

- హిందుస్థానీ సంప్రదాయ సంగీతంపై... ఇస్లాం, అరబిక్, పారశీక సంగీత రీతులు ప్రభావం ఉంది. ఇది భారతీయ లఘుకళా చిత్ర సంప్రదాయాన్ని సృష్టించింది. హిందూస్థానీ సంగీతంలో ధ్రుపదులు, ఖయాల్స్, కవ్వాలి అనే రీతులున్నాయి.వీటితోపాటే టుమ్రీలు, తప్పా, తరానీ ప్రక్రియ లుంటాయి. హిందూస్థానీ సంగీతంలో శ్రావ్యత, మాధుర్యాని (Melody)కి అధిక ప్రాధాన్యతనిస్తారు. బాణీలు జారిపోతు న్నట్లు ఉంటాయి. నియమాలు, సూత్రాలు సులభతరంగా ఉంటాయి.
- హిందుస్థానీలో భాష-తాళం ఉంటాయి. దీన్నే 'బందిష్' అని అంటారు. హెచ్చుస్థాయిలో పాడతారు. ప్రచారంలో ఉన్న 'తాళాలు'... దాద్ర, దుయర్, రూపక్, త్రితాళ్, ఏక్‌తాళ్, చౌతాళ్ మొదలైనవి. ఇందులో 'స్వరాలు' ముఖ్యమైనవి. ఒక 'స్వరం' నుంచి ఇంకొక 'స్వరానికి' జారుడుగా వెళ్లి ఆలపించే జ్ఞానం ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది.
- హిందుస్థానీ స్వరాలు.. షడ్జ, కోమల రిషబ్, శుద్ధ రిషబ్, కోమల్ గాంధార్, శుద్ధ గాంధార్, శుద్ధ మధ్యమం, తీవ్ర మధ్యం, పంచమ్, కోమల దైవత్, శుద్ధ దైవత్, కోమల్ నిషాద్, శుద్ధ నిషాదులుగా పేర్కొన్నారు. ఈ 'స్వరాలే' రాగాలకు మూలాధారం. ఈ స్వరాలను మంద్ర తారా స్థాయిలో ఆలపిస్తారు.
- హిందుస్థానీ సంగీతం 'గృహం' అనే పదం నుంచి పుట్టింది. చివరకు ఇది హిందూఘర్ అయింది. 'ఘరానా' అంటే కుటుంబం. తండ్రి నుంచి కొడుకు, తల్లి నుంచి కూతురు... కుటుంబం వంశపారంపర్యంగా సంక్రమించే గీతం 'ఘరానా' సంప్రదాయంగా అభివృద్ధి చెందింది. ఉదాహరణకు గ్వాలియర్ ఘరానా సంగీతం, జయపూర్, పాటియాలా, రాంపూర్, ఢిల్లీ, కిరణ్ ఘరానాలు బహుళ ప్రజాదరణ పొందాయి. ఈ సంప్రదాయంలో అమీర్‌ఖాన్, కుమార గంధర్వ, భీమసేన్ జోషి, అబ్దుల్ కరీంఖాన్ వంటి వారు గొప్ప 'ఘరానా' సంగీత విద్వాంసులు. ప్రారంభ దశలో ఘరానా సంగీతం సామాన్య ప్రజలకు అందుబాటులో లేదు. ఇది రాజ ప్రాసాదాలు, హవేలీలకు, నవాబులు, రాజులకే పరిమితం. ఈ



సంగీతాన్ని వి.ఎన్.భట్కండే, విష్ణు దిగంబర్ పాలూస్కర్ వంటి గొప్ప హిందుస్థానీ సంగీత విద్వాంసులు సంస్కరించారు. ధ్రుపదులు, ఖయాల్స్, విలంచిత (మెల్లగా), ధృత్ (మాత్ర) రాగాలకు నొటేషన్స్ ప్రవేశపెట్టి సంస్కరించారు.

హిందుస్థానీలో కొన్ని సంగీత రీతులు :

- **ధ్రుపదులు**(Dhrupad): ధ్రువ పదమే ధ్రుపద్ అయింది. తరానాలు, చతురంగాలు, లక్షణ గీతాలు, స్వరావర్తాలు ఇవన్నీ ధ్రుపదు సంప్రదాయానికి చెందినవే! ధ్రుపదు సాహిత్యంలో ఈశ్వరస్తుతి, భక్తి ఉన్నతంగా ఉంటుంది. ధ్రుపదు సంగీతాన్ని గ్వాలియర్ రాజా మాన్‌సింగ్ తోమార్, అక్బర్ ఎంతో అభివృద్ధి చేశారు. స్వామిహరి దాస్, తాన్‌సేన్, బైజూబావ్రా, ధ్రుపదు సంగీతంలో పేరు పొందిన గాయకులు. ధ్రుపదు గాత్ర సంగీతం గంభీరంగా ఉంటుంది. ఆలాపనతో ప్రారంభమై.. జోడ్, అంతర, సంచారీ, అభోగ్ అనే నాలుగు బాణీలుంటాయి. సాహిత్యం 'బ్రిజ్' భాషలో ఉంటుంది. వీరం, శృంగార రసాలుంటాయి. ఆధునిక కాలంలో ధ్రుపదు సంగీతాన్ని 'దగ్గార్' కుటుంబీకులు పూర్వ సంగీత సంప్రదాయాలను పాటిస్తూ... బహుళ ప్రచారంలోకి తెచ్చారు.
- **ఖయాల్స్ రీతి:** హిందూస్థానీ సంగీతాన్ని క్రీ.శ. 15వ శతాబ్దంలో అమీర్ ఖుస్రూ, సుల్తాన్ మహ్మద్ షారీఖీ బహుళ ప్రచారంలోకి తెచ్చారు. ఇది క్రీ.శ.18వ శతాబ్దంలో సదరంగ్ నామతీ ఖాన్, అదరంగ్ మహ్మద్ రంగీలాల కాలంలో శాస్త్రీయ సంగీతంగా అభివృద్ధి చెందింది. ఖయాల్స్ పద్ధతి పర్షియా దేశం నుంచి భారత్‌లోకి ప్రవేశించింది. ఖయాల్స్ శృంగారభరితంగా ఉంటాయి. ఖయాల్స్‌లో గ్వాలియర్, ఆగ్రా, జైపూర్, కిరణ్ ఘరానాలు ప్రధానమైనవి.

  గ్వాలియర్ ఘరానా: ఇది అతి ప్రాచీనమైన హిందుస్థానీ సంప్రదాయ సంగీతం. ఇందులో నాధన్‌ఖాన్, పీర్‌భక్సు గొప్ప సంగీత విద్వాంసులు.

  ఆగ్రా ఘరానా : ఇది రంగీలా ఘరానాగా పేరు పొందింది. హాజీ సుజన్‌ఖాన్, పయ్యాజ్‌ఖాన్‌లు పేరు పొందిన గాయకులు.

  కిరణ్ ఘరానా : ఇది ఇటీవల వెలుగులోకి వచ్చింది. అబ్దుల్ వహీద్ ఖాన్ దీన్ని ప్రచారం చేశారు. ఈ ఘరానా సంగీత రీతులను శ్రీకృష్ణ

ఆలయాల్లో పాడతారు. దసరా, దీపావళి, హోళీ పండుగల్లో కచేరీలు నిర్వహిస్తారు. ఇవి కాకుండా మేవావతి, ఢిల్లీ ఘరానాలున్నాయి.

- **టుమ్రీలు** (Tumris): ఇది హిందుస్థానీ సంగీతంలో ప్రధాన సంప్రదాయం. దీన్ని టుమ్రీ, కజిరీ, బెయిరీ, హోరి, బ్రిజ్ భాషలో పాడతారు. భక్తి పాటలను సరళంగా పాడతారు. భగవంతుని 'స్తుతి' అతి మధురంగా ఆలపిస్తారు. టుమ్రీలకు కథక్ నాట్యంతో సంబంధం ఉంది. జానపద రీతిలో పాడతారు. బెనారస్ టుమ్రీలకు ప్రసిద్ధి. టుమ్రీ సంగీతాన్ని 19వ శతాబ్దంలో నవాబ్ వజీద్ ఆరీషా పోషించారు. సిద్ధేశ్వరీ దేవి టుమ్రీ ప్రక్రియలో గొప్ప పేరు గాంచిన గాయకురాలు.
- **తప్పా** (Tappa) : పంజాబ్ దీనికి ప్రసిద్ధి. పాటలు వేగవంతంగా ఉంటాయి. ఒంటెలు తోలేవారి పాటల నుంచి ఇదిఅభివృద్ధి చెందింది.
- **తరానా** (Tarana): పారశీక భాష నుంచి ఆవిర్భవింది. 'తరానాలు' వేగంగా పాడతారు.
- **కవ్వాలి** (Khavvali): ఇది పారశీక సంప్రదాయ సంగీత రీతి. భారతీయ భాషలో మిళితమై-ఉర్దూ, పారశీక భాషలు రెండూ ఉంటాయి. ఒంటరిగా లేదా గ్రూపులుగా ఉర్సు ఉత్సవాల్లో పాడ తారు. ఇందులో సంగీతం కంటే తత్వాలు, నీతులు ప్రధానంగా ఉంటాయి. అమీర్ ఖుస్రూతో ఆరంభమైన కవ్వాలీలు... హిందీ భాషలో గజల్స్‌గా ప్రచారంలోకి వచ్చాయి. మహ్మద్ ప్రవక్తను, అల్లాను ఇందులో స్తుతిస్తారు. భగవంతుడే కథా వస్తువు. కవ్వాలీలు బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, హైదరాబాద్‌లలో బహుళ ప్రజాదరణ పొందాయి.
- **కజ్రి** (Kajri): కజ్రీ జానపద ప్రక్రియ. దీనికి బెనారస్, మీర్జాపూర్ ప్రధాన కేంద్రాలు. రుతువులను అనుసరించి పాడతారు.
- **చెయితీ** (Chaiti): దీన్ని చైత్ర మాసంలో పాడతారు. రామలీల కథా వస్తువు.
- **హోరీ** (Hori): ఇది శృంగార భరితంగా ఉంటుంది. ఫాల్గుణ మాసంలో పాడతారు.

ప్రసిద్ధి పొందిన గాయకులు :

అమీర్ ఖుస్రో, తాన్‌సేన్, స్వామిహరిదాస్, బైజు బావ్రా, విష్ణు నారాయణ భట్కండే, విష్ణు దిగంబర పాలూస్కర్, జయదేవుడు, తుకారాం, సూరదాసు, మీరాబాయి, తులసీదాస్, నానక్, కబీర్, చైతన్య ప్రభు మొదలైన వాగ్గేయకారులు.

ఆధునిక హిందుస్థానీ సంగీత విద్వాంసులు :

ఆలీ అక్బర్ ఖాన్ (సరోద్), రవిశంకర్ (సితార్), ప్రభా ఆత్రే (గాత్రం), కుమార గంధర్వ (గాత్రం), పర్వీనా సుల్తానా (గాత్రం), బిస్మిల్లా ఖాన్ (షెహనాయ్), విలాయత్ ఖాన్ (సితార్), శివకుమార శర్మ (సంతూర్), గంగుబాయి హంగల్ (కిరణ్ ఘరానా), శరణ్ రాణి (సరోద్), కిశోర్ అమోంకర్ (గాత్రం). 19వ శతాబ్దం ప్రారంభంలో హిందూస్థానీ సంగీతం కొంత నిర్లక్ష్యానికి గురైనా... 20వ శతాబ్దంలో పూర్వవైభవం పొందింది. స్వాతంత్ర్య సమర కాలంలో.. కాజ నజ్రుల్ ఇస్లాం, విష్ణు దిగంబర పాలూస్కర్, సుబ్రమణ్యభారతి వంటి వారు ఇందుకోసం గొప్ప కృషి చేశారు.

భారతీయ సంగీతాన్ని పోషించే సంస్థలు :

భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంగీత నాటక అకాడెమీ ఢిల్లీలో ఉంది. దీన్ని 1953లో స్థాపించారు. సంగీతం, నాట్యం, రంగస్థలం వంటి ప్రక్రియల్లో సదస్సులు, పోటీలు నిర్వహి స్తుంది. ఉన్నత ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులిస్తుంది. జానపద, గిరిజన, శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇస్తుంది. ఔత్సా హికులకు గ్రాంటులిస్తుంది. ఢిల్లీలో కథక్ శిక్షణా కేంద్రం ఉంది. నెహ్రూ డాన్స్ అకాడెమీ ఇంఫాల్‌లో ఉంది. ఇది భారతీయ లలిత కళలను ఆదరిస్తుంది. గత 25 ఏళ్లుగా నుంచి అఖిల భారత సంగీత పోటీలను నిర్వహిస్తున్న సంగీతయాన్ (సంగీత కళా గ్రూప్)ఢిల్లీలో ఉంది. మధ్యప్రదేశ్‌లో భారత్ భవన్, మధ్య ప్రదేశ్ కళాపరిషత్, తాన్‌సేన్ సంగీత సమ్మేళన్ వంటి సంస్థలు లలిత కళలను ప్రోత్సహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సంగీత- నాటక-సాహిత్య అకాడెమీలు గతంలో ఉండేవి. ఇప్పుడు అవన్నీ తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోకి వచ్చాయి. మద్రాస్‌లో కృష్ణ గానసభ, మద్రాస్ మ్యూజిక్ అకాడెమీ, తమిళ ఇసై సంఘం (మద్రాస్), ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ (మద్రాస్), నారద గానసభ(మద్రాస్), మైలాపూర్ ఫైన్ ఆర్ట్స్ క్లబ్ (మద్రాస్), కార్తీన్ ఫైన్ ఆర్ట్స్ (మద్రాస్) మొదలైన సంస్థలు భారతీయ సంగీతాన్ని ప్రోత్సహిస్తున్నాయి. మద్రాస్ మ్యూజిక్ అకాడెమీ... 'సంగీత కళానిధి' వంటి బిరుదులిచ్చి సంగీత కళాకారులను సత్కరిస్తోంది. ఈ బిరుదు అంతర్జాతీయ ఖ్యాతి గడించింది!!